అక్రమ సంబంధాన్ని ప్రశ్నించినందుకు

ముగ్గురు ప్రాణాలు తీశాడు

- భార్యా, ఇద్దరు కుమార్తెలు చంపిన కసాయి
- హత్య చేసి యాక్సిడెంట్‌గా చిత్రీకరణ
- వివరాలు వెల్లడించిన ఖమ్మం ఏసీపీ రమణమూర్తి

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణమూర్తి, వెనుక నిందితుడు ప్రవీణ్

రఘునాథపాలెం, జూలై 14: వృత్తి రీత్యా అతడు వైద్యుడు.. ఓ మహిళతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు.. విషయం భార్యకు తెలిసింది.. అక్రమ సంబంధంపై పలుమార్లు భర్తను ప్రశ్నించింది.. తన అక్రమ సంబంధానికి అడ్డొస్తున్న భార్యా, పిల్లలనే అడ్డు తొలగించుకోవాలనుకు న్నాడు.. అవకాశం కోసం ఎదురు చూస్తు న్నాడు.. ఇంతలో భార్య తనకు ఒంట్లో బాగాలేదు అని చెప్పింది.. అదును కోసం ఎదురు చూస్తున్న ఆ భర్తకు అవకాశం వచ్చింది.. తను వేసుకున్న పథకం ప్రకారం.. భార్యా పిల్లలను కారులో తీసు కెళ్తూ ఇంజక్షన్ వేస్తాననడంతో భార్య సరేన న్నది.. ఆమెకు హైడోస్ మత్తు ఇంజక్షన్ వేశాడు.. పక్కనే ఉన్న ఇద్దరు పిల్లలను గొంతు నులిమి హత్య చేశాడు... కారును చెట్టుకు ఢీకొట్టి రోడ్డు ప్రమాదంలో చనిపో యినట్లుగా సృష్టించే ప్రయత్నం చేశాడు.. మే 28న రఘునాథపాలెం మండలం బావోజీతండాలో జరిగిన ఈ ఘటనను అనుమానించిన పోలీసులు సమోటోగా తీసుకొని విచారణ చేపట్టారు.. భర్తే హంత కుడిగా గుర్తించారు. ఇందుకు సంబంధిం చిన పూర్తి వివరాలను ఆదివారం రఘునా థపాలెం పోలీస్ స్టేషన్‌లో ఖమ్మం ఏసీపీ రమణమూర్తి వెల్లడించారు.

బావోజీతండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తూ కుటుం బంతో కలిసి అక్కడే నివాసం ఉంటు న్నాడు. ప్రవీణ్‌కు భార్య కుమారి(26) ఇద్దరు కుమార్తె లు క్రుషిక(3), కృతిక(4) ఉన్నారు. తాను పని చేసే ఆసుపత్రిలో నర్స్‌గా పని చేస్తున్న కేరళకు చెందిన సోనీ ఫ్రాన్సిస్‌తో ప్రవీణ్‌కు పరిచయం ఏర్పడి అక్రమ సంబంధానికి దారితీసింది. విషయం భార్య కుమారికి తెలిసి ప్రశ్నిం చింది. తరచూ విషయాన్ని లేవనెత్తి ఘర్షణ పడుతుండేది. కుమారుడి అక్రమ సంబంధం విషయం తెలుసుకున్న ప్రవీణ్ తల్లిదండ్రులు మందలించి ఇంటికి రమ్మన డంతో మే నెలలో భార్యా, పిల్లలను తీసు కొని కారులో బావోజీతండాకు వచ్చాడు. మే 28న భార్యా, పిల్లల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించేందుకు ప్రవీణ్ ముగ్గురిని కారులో ఖమ్మం తీసుకొచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో మార్గం మధ్యలోకి రాగానే భార్య తనకు సుస్తీగా ఉందని చెప్పడంతో ప్రవీణ్ ఇంజెక్షన్ వేస్తానని చెప్పాడు. కారును ఓ డొంకలోకి తీసుకెళ్లి భార్యకు హైడోస్ మత్తు ఇంజక్షన్ వేశాడు. కాసేపటికే కుమారి మత్తు లోకి జారుకుంది. వెంటనే పక్కనే ఉన్న తన ఇద్దరు పిల్లలు క్రుషిక, కృతికను కారు దింపి ఒకరి తరువాత ఒకరిని ముక్కు, నోరు మూసి హత్య చేశాడు. ఆ తరువాత పిల్ల లను కారు ముందు సీటులో పడుకోబె ట్టాడు. హత్య చేసి యాక్సిడెంట్‌గా చిత్రీక రించేందుకు హర్యాతండా వద్ద మూలమ లుపులో చెట్టుకు ఢీకొట్టాడు. ప్రమాదం లోనే భార్యా, కూతుళ్లు చనిపోయినట్లు పోలీసులను నమ్మించాడు. మొదట రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేసిన పోలీ సులు మృతుల ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనుమానంతో పోస్టు మార్టం రిపోర్టు ఆధారంగా ప్రవీణ్‌ను అదు పులోకి తీసుకొని విచారించగా ముగ్గురినీ హత్య చేసినట్లుగా ఒప్పుకున్నట్లు ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ప్రవీణ్‌తో పాటు హత్యకు ప్రేరేపించిన ప్రియురాలు సోనీ ఫ్రాన్సిస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలి పారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన రఘునాథపాలెం సీఐ శ్రీహరి, ఎస్సై సురేశ్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

కొత్త సార్లు ఎప్పుడొస్తారో..!

- సర్కారు బడుల్లో ముందుకు సాగని చదువులు
- ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులతో అంతా గజిబిజి
- చాలా పాఠశాలల్లో వేధిస్తున్న టీచర్ల కొరత
- తరగతి గదులూ అంతంతమాత్రమే..
- లోపించిన పారిశుధ్యం.. కంపుకొడుతున్న మరుగుదొడ్లు

ఒకే గదిలో కూర్చున్న ఐదు తరగతుల విద్యార్థులు..

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 14 (నమస్తే తెలంగాణ) : సర్కారు బడుల్లో ఈ ఏడాది చదు వులు సాగడం కష్టంగానే కనిపిస్తున్నది. ఒకవైపు డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేయడం.. మరోవైపు ఉపా ధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఒక కొలిక్కి రావడంతో పలు పాఠశాలల్లో ఉపా ధ్యాయుల కొరత వేధిస్తున్నది. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం ఆదిలోనే విఫలమైంది. దీంతో పాఠశా లల పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. మరో వైపు పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేసేవారు లేక మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. ఉన్న ఉపాధ్యాయులు మేము ఎట్లాగూ బదిలీపై వెళ్లిపో తున్నామని సరైన శ్రద్ధ చూపకపోవడంతో సర్కారు బడుల్లో విద్యాబోధన అటకెక్కింది. ఇవన్నీ విద్యాశాఖకు తలకు మించిన భారంగా మారింది.

కొత్త సార్లు వచ్చేదాకా పాఠాలెలా..?

గత నెల నుంచి టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్న తుల ప్రక్రియ కొనసాగుతుండడంతో ఉపాధ్యా యులంతా జిల్లా కార్యాలయాల చుట్టూ తిరగడా నికే సమయాన్ని వెచ్చించారు. దీంతో పాఠశాలల ప్రారంభం కూడా మొక్కుబడిగానే చేశారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తికావ డంతో ప్రైమరీ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యా యులు హైస్కూల్స్‌కు ఎస్జీటీలుగా వెళ్లిపో యారు. దీంతో ప్రైమరీ స్కూల్స్‌లో టీచర్ల కొరత స్పష్టంగా కనబడుతున్నది. జిల్లావ్యాప్తంగా 273 సింగిల్ టీచర్ల ఉన్న పాఠశాలలు ఉన్నాయి. విద్యా ర్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేకపోవ డంతో ఐదు తరగతులు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు టీచర్లే పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. పుస్తకాలు ఇచ్చారు.. యూనిఫాంలు ఇచ్చినా చదువులు మాత్రం సాగడం లేదనే చెప్పాలి.

అపరిశుభ్ర వాతావరణంలో పాఠశాలలు..

స్వచ్ఛతకు మారుపేరులా ఉండే ప్రభుత్వ పాఠశాలలు నేడు అపరిశుభ్రతకు నిలయాలుగా మారిపోయాయి. ఆవరణలు అంతా పిచ్చిగడ్డితో దర్శనమిస్తున్నాయి. కొత్తగూడెం బాబూక్యాం పులో ప్రభుత్వ పాఠశాలలో బడిబయట, ఆవర ణలో కూడా పిచ్చిమొక్కలు, గడ్డి దర్శనమిస్తు న్నది. బాత్‌రూంలు మరీ అధ్వాన్నంగా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం కొత్తూరు పాఠశాలలో బడివెనుక మొత్తం గడ్డి మొలిచి అధ్వాన్నంగా ఉంది. ములకలపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పాఠశాలల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది.

ఐదు తరగతులు ఒకే గదిలో..

జిల్లా కేంద్రం బాబూక్యాంపు ప్రైమరీ పాఠశా లలో ఉన్న టీచర్లు బదిలీపై వెళ్లడంతో అక్కడ ఒక టీచరే ఉన్నారు. దీంతో టీచర్ల కొరతను దృష్టిలో ఉంచుకుని ఎంఈవో సింగిల్ టీచర్లు ఉన్న పాఠశాలలకు వేరే టీచర్లను సర్దుబాటు చేశారు. కానీ ఒక టీచర్ లీవు పెడితే ఐదు తరగ తుల పిల్లలు ఒకేచోట ఉండాల్సి వస్తున్నది. పిల్ల లకు పాఠాలు చెప్పడం ఆ ఒక్క టీచర్‌తో సాధ్య మవుతుందా అంటే ఎవరైనా నో అనే చెప్తారు.

జిల్లాలో పాఠశాలల వివరాలు ఇలా..

జిల్లాలో మొత్తం 1,065 పాఠశాలలు ఉండగా అందులో 3,682 టీచర్లు ఉన్నారు. ఇంకా 447 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల టీచర్లు బదిలీల్లో 1,300 మంది ఎస్జీటీలకు బదిలీలు అయ్యాయి. ఇందులో పండిట్‌లు, పీఈటీలు కూడా ఉన్నారు. దీంతోపాటు 700 మందికి పదోన్నతులు కూడా వచ్చాయి. ప్రైమరీ స్కూల్స్‌లో ఉన్న టీచర్లకు ఎస్జీటీలుగా హైస్కూ ల్స్‌కు ఉద్యోగోన్నతులు రావడం వల్ల చిన్న స్కూల్స్‌లో టీచర్ల కొరత ఏర్పడింది. దీంతో ఎంఈవోలు సర్దుబాటు చేయలేక సతమతమవు తున్నారు. ఒక స్కూల్ నుంచి ఇద్దరికి ఉద్యోగోన్న తులు రావడంతో అక్కడ రెండు ఖాళీలు ఏర్పడ టంతో టీచర్లు లేక అశ్వారావుపేట మండలంలో విద్యార్థులు రోడెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధ్వానంగా స్కూల్ మరుగుదొడ్లు

టీచర్లను సర్దుబాటు చేస్తున్నాము..

బదిలీలు, ఉద్యోగో న్నతుల వల్ల టీచర్లు చాలామంది బయటకు వెళ్లిపోయారు. దీంతో సమస్య ఏర్పడింది. అయినా వేరే స్కూల్స్ నుంచి విద్యార్థులు ఉన్నచోటకు టీచర్లను సర్దుబాటు చేస్తున్నాము. కొత్తవారు వచ్చే దాక కొంత సమస్య ఉంటుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ప్రకారం భర్తీ ప్రక్రియ జరుగుతుంది. పారిశుద్యం విషయంలో అక్కడ ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి. పంచాయతీల్లో పారిశుద్య కార్మి కులు శుభ్రం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరి ధిలో కూడా చేస్తున్నారు. కొన్నిచోట్ల జరగక పోవడం లేదని తెలిసింది.

– వెంకటేశ్వరాచారి, డీఈవో

ఆవరణ బయట కూడా గడ్డితో ఉన్న కొత్తగూడెం బాబూక్యాంపు స్కూల్

మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, జూలై 14: రాష్ట్ర రెవెన్యూ, సమా చార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి ఆదివారం మండ లంలో పర్యటించారు. కొండాపురం, ఆరెంపుల, తనగంపాడు గ్రామాల్లో రూ.28 లక్షలతో నిర్మాణం చేపట్టబోయే సీసీ, బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గూడూరుపా డులో రూ.20లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న పల్లె దావఖానను ప్రారం భించారు. అనంతరం దారి మధ్యలో వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. కార్యక్ర మంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలతి, ఆర్డీవో గణేష్, పీఆర్ఈఈ వెంకటరెడ్డి, ఎం శ్రీనివాసరావు, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరారావు, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- గోదావరి వరద ముంపు ప్రాంతాల పరిశీలన

విస్తా కాంప్లెక్స్ వద్ద డ్రైనేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్

భద్రాచలం, జూలై 14: గోదావరి నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున అధి కారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆది వారం పట్టణంలోని గోదా వరి వరద ముంపునకు గురయ్యే ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ముందుగా విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న పంపింగ్ మోటర్లను, వరద ఎక్కువైనప్పుడు గోదావరిలోకి వదిలే కనెక్షన్ పరికరాలను ఆయన పరిశీలించారు. ఎప్ప టికప్పుడు వేస్ట్ వాటర్‌ను గోదావరిలోకి వదిలివేయాలని, అవసరమైతే అదనపు మోట ర్లను తెప్పించుకోవాలని అధికారులకు సూచించారు. గోదావరి వరద పెరిగిన వెంటనే ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. విస్తా కాంప్లెక్స్ పక్కన ఉన్న డ్రైనేజీ పరిసరాలను ఆయన పరిశీలించి, పంచాయతీ సిబ్బంది ద్వారా ఎప్పటిక ప్పుడు పరిశుభ్రం చేయించాలని తెలిపారు. అనంతరం కూనవరం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కరకట్ట ప్రదేశాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోదావ రికి వరదలు రాకముందే కరకట్ట నిర్మాణం పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేసేందుకు కొత్తగా నిర్మించిన డంపింగ్ యార్డును పరిశీలిం చారు. వర్షాకాలం కావడంతో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, లేనిపక్షంలో దోమలు పెరిగి అంటువ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఆయిల్‌పామ్ మొక్కలకు 90 శాతం రాయితీ

ఖమ్మం వ్యవసాయం, జూలై 14: ఆయిల్‌పామ్ సాగుకు రైతులకు 90 శాతం రాయి తీపై మొక్కలు అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి బీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. అంతర్ పంటల సాగు కోసం రైతులకు ఎకరానికి రూ.4,200 చొప్పున ఇస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం 11,500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు పెంచేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇటీవల కొందరు ఆయిల్‌పామ్ సాగుపై అపో హలు సృష్టిస్తున్నారని, అలాంటి పుకార్లు నమ్మి ఆగం కావొద్దని రైతులకు తెలిపారు. ఒక సారి పంట సాగు చేస్తే 30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. తక్కువ పెట్టు బడి.. ఎక్కువ లాభాలు అందించే ఆయిల్‌పామ్ సాగు ఎంతో లాభదాయకమని పేర్కొ న్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఆయా నియోజకవర్గాల ఉద్యానశాఖ అధికారులను గానీ, జిల్లా ఉద్యానశాఖ అధికారిని గాని సంప్రదించవచ్చని కోరారు.

భర్త దాడి.. భార్య మృతి

విచారణ జరుపుతున్న కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు

కొత్తగూడెం క్రైం, జూలై 14: భర్త దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న భార్య పరిస్థితి విషమించి మృతిచెందిన ఘటన కొత్తగూడెంలో ఆది వారం జరిగింది. కొత్తగూడెం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్ కథనం ప్రకారం.. కొత్తగూడెం బర్లిఫిట్ ఏరియాకు చెందిన దాసరి శ్రీనివాసరావు కోర్టు గుమ స్తాగా పనిచేస్తున్నాడు. ఏడాది కాలంగా కోర్టుకి వెళ్లకుండా మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటున్నాడు. తరచూ అతడి భార్య పూర్ణ (50)తో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం శ్రీని వాసరావు తన భార్యపై కర్రతో దాడి చేయ డంలో ఆమె తలకు బలమైన గాయమైంది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు క్షతగా త్రురాలిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తర లించారు. అక్కడ ఆమె చికిత్సపొందు తోంది. పరిస్థితి విషమించడంతో ఆది వారం మృతిచెందింది. సమాచారం తెలు సుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితులను పరి శీలించారు. పూర్ణ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా వైద్యశాల మార్చూ రీకి తరలించారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్ స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

అతి విశ్వాసమే బీజేపీని దెబ్బతీసింది

యూపీలో లోక్‌సభ ఫలితాలపై సీఎం యోగి ఆదిత్యనాథ్

లక్నో, జూలై 14: అతి విశ్వాసమే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీసిందని ఉత్త రప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ ప్రజలు అధికార బీజేపీకి ఊహించని షాక్ ఇచ్చారు. 2019లో 62 ఎంపీ స్థానాలు గెలుచుకున్న బీజేపీ, ఈ సారి 33 స్థానాలకు పరిమిత మైంది. ఈ నేపథ్యంలో ఆదివారం లక్నోలో బీజేపీ యూపీ వర్కింగ్ కమిటీ సమావేశం వాడివేడిగా జరిగింది. సీఎం యోగి మాట్లా డుతూ, 'ప్రధాని మోదీ నాయకత్వంలో, యూపీలో ప్రతిపక్షంపై నిరంతరం ఒత్తిడి పెంచాం. దీంతో 2014, 2017, 2019 ఎన్నికల్లో విజయం సాధించాం. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు ప్రతిపక్షా నికి బదిలీ అయ్యాయి. ఇది మన అతి విశ్వాసం వల్లే జరిగింది. మన అంచనాల్ని తలకిందులు చేసింది. ఓటమితో నీరసప డిన ప్రతిపక్షం.. ఇప్పుడు గెలుపును అందు కొని పుంజుకుంది' అని అన్నారు. ఏడు రాష్ర్టాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ ఘోర పరాభావాన్ని పొందింది.

ఢిల్లీ దవాఖానలో కాల్పులు.. రోగి మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జీటీబీ హాస్పిట ల్‌లో ఓ టీనేజర్ ఆదివారం జరిపిన కాల్పుల్లో ఓ రోగి ప్రాణాలు కోల్పో యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రియాజుద్దీన్ (32) పొత్తి కడుపు ఇన్ఫెక్షన్‌తో గత నెల 23 నుంచి ఈ దవా ఖానలో చికిత్స పొందుతున్నారు. 24వ వార్డులో ఉన్న ఆయనపై 18 ఏళ్ల యువ కుడు జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారు. వ్యక్తిగత కారణాల వల్లే కాల్పులు జరిపినట్లు తెలుస్తున్నదని డిప్యూటీ పోలీస్ కమిషనర్ (సహదర) సురేంద్ర చౌదరి చెప్పారు.

30 ఏండ్లకు తెరుచుకున్న ఉమా భగవతి ఆలయం

శ్రీనగర్: జమ్ముకశ్మీరులోని అనంత్ నాగ్ జిల్లాలో ఉన్న ఉమా భగవతి దేవాల యాన్ని సుమారు 30 ఏండ్ల తర్వాత తిరిగి తెరిచారు. కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ సమక్షంలో ఆదివారం ఉమా భగ వతి ప్రాణప్రతిష్ఠ, పూజలు నిర్వహించారు. పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో ఈ దేవాలయంలో పూజలు చేయడానికి భక్తు లకు అనుమతి ఇచ్చారు.

ఆగస్టునాటికి దేశవ్యాప్తంగా 'యూ-విన్'

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సాధారణ టీకాల కార్యక్రమ ట్రాకింగ్, నమోదు కోసం ఆగస్ట్ చివరి నాటికి యూ-విన్ పోర్టల్ అందుబాటులోకి రానుందని అధి కార వర్గాలు తెలిపాయి. కొవిడ్ వ్యాక్సినే షన్ పోర్టల్ కొ-విన్‌కు నకలుగా ఉండే ఈ పోర్టల్‌ను పశ్చిమ బెంగాల్ మినహా మిగతా రాష్ర్టాలు, కేంద్ర పాలిత ప్రాం తాల్లో ఇప్ప టికే పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నారు. గర్భిణులు, అయిదేండ్ల లోపు పిల్లలకు వేసే ప్రతి టీకాను యూ-విన్‌లో నమోదు చేయ నున్నారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా పని చేసే ఈ పోర్టల్‌లో ఈ-టీకా ధ్రువీకరణ పత్రాన్ని ఒక్క క్లిక్ ద్వారా పౌరులెవరైనా పొందొచ్చు. రియల్ టైమ్‌లో పనిచేసే ఈ పోర్టల్ లేదా ఆండ్రాయిడ్ మొబైల్ అప్లికే షన్‌లో కోరుకున్న టీకా కేంద్రాల్లో టీకాలు పొందడానికి పౌరులు స్వీయ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. టీకా వేయించుకొనే టైమ్‌ను షెడ్యూల్ చేసుకోవచ్చు.

కర్ణాటకలో బస్సు చార్జీల మోత!

- ఏకంగా 20 శాతం మేర పెంపు?
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం
- కేఎస్ఆర్టీసీ చైర్మన్ శ్రీనివాస్ వెల్లడి
- గత నెల పెట్రోల్, డీజిల్‌పై పన్నును 4 శాతం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఏడాదిగా ప్రజలపై పన్నుల మోత
- సిద్ధరామయ్య సర్కార్‌పై జనాగ్రహం

తుమకూరు/బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సామాన్య ప్రజ లపై మరో భారం పడనున్నది. రాష్ట్రంలో త్వరలో బస్సు చార్జీలు భారీ స్థాయిలో పెరుగ నున్నాయి. దీనిపై కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(కేఎస్ఆర్టీసీ) చైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ప్రభుత్వ బస్సుల్లో చార్జీల పెంపు అనేది అనివార్యమని ఆయన పేర్కొన్నారు. బస్సు చార్జీలను 15-20 పెంచా లని రాష్ట్ర ప్రభుత్వానికి కేఎస్ఆర్టీసీ ఇప్పటికే ప్రతిపాదనలు పంపిందని వెల్లడించారు. 'రెండు రోజుల క్రితం మా బోర్డు సమావేశం జరిగింది. బస్సు చార్జీలను 15-20 పెంచా లని మేం ప్రతిపాదనలు పంపాం. మిగతాది సీఎం సిద్ధరామయ్య విచక్షణపై ఆధారపడి ఉంటుంది. కేఎస్ఆర్టీసీ మనుగడ సాగించా లంటే, చార్జీల పెంపు తప్పనిసరి' శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇంధన, బస్సుల విడి పరిక రాల ధరలు పెరిగాయని చెప్పారు. 2019 నుంచి రాష్ట్రంలో చార్జీల పెంపు లేదని, అదేవి ధంగా కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల సవ రణ కూడా 2020 నుంచి జరుగలేదని, కాబట్టి టికెట్ ధరలను పెంచడం అవసరమని చెప్పుకొచ్చారు. గత మూడు నెలల కాలంలో కార్పొరేషన్‌కు రూ.295 కోట్ల నష్టం వచ్చిం దని వెల్లడించారు.

గత ఏడాదిలో పన్నుల మోత

ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో అధి కారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల మోత మోగిస్తున్నది. వివిధ రకాల పన్నులు, ఇతరత్రా రూపాల్లో సామా న్యుడి జేబును గుల్ల చేస్తున్నది. ఇప్పటికే గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్‌ను ఇబ్బడిముబ్బ డిగా వసూలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత నెలలో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను దాదాపు 4 శాతం చొప్పున పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. మరోవైపు పాల ధరలను కూడా లీటర్, అర లీటర్ ప్యాకెట్లపై రూ.2 చొప్పున కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కే ఎంఎఫ్) పెంచిన విషయం తెలిసిందే.

గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమ యంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టింది. ఆ గ్యారెంటీ లను అమలు చేయాలంటే వేలాది కోట్ల రూపాయలు అవసరం. అయితే నిధుల అందుబాటును పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా హామీలిచ్చే సిన కాంగ్రెస్.. అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్యారెంటీలకు ఆంక్షలు, కోతలతో ఎగనామం పెడు తున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశా రని, మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తా మన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరిం చిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యా మన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్ లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

నిన్న వాల్మీకి.. నేడు వక్ఫ్ బోర్డ్

కర్ణాటకలో నిధుల గోల్‌మాల్

బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అవినీతి బాగోతాలు మెల్లమెల్లగా బయటపడుతున్నాయి. వాల్మీకి కార్పొరేష న్‌లో చోటుచేసుకున్న భారీ కుంభకోణం (రూ.187 కోట్ల వరకు నిధుల దారిమళ్లింపు) మరువకముందే, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లో మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. గతంలో వక్ఫ్ బోర్డ్ సీఈవోగా పనిచేసిన జుల్ఫీకరుల్లా రూ.4 కోట్ల నిధుల్ని అక్రమంగా తరలించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధులు కాజేసిన అతడిపై చర్యలు చేపట్టాలని వక్ఫ్ బోర్డ్ ప్రస్తుత సీఈవో మీర్ అహ్మద్ అబ్బాస్ బెంగళూరులోని హై గ్రౌండ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వక్ఫ్‌బోర్డ్‌కు అతడి వల్ల రూ.8.03 కోట్లు నష్టం వాటిల్లిం దని ఆయన ఆరోపించారు. 'గుల్బర్గా దర్గాలో వక్ఫ్ భూముల్ని తీసుకున్నందుకు ప్రభుత్వం రూ.2.29 కోట్లు చెల్లించింది. అలాగే ఎండో మెంట్ శాఖ నుంచి రూ.1.79 కోట్లు వక్ఫ్ బోర్డ్‌కు జమయ్యాయి. మొత్తం రూ.4,00,45,465 వక్ఫ్ బోర్డ్ బ్యాంక్ ఖాతాలో జమైంది. ఈ మొత్తాన్ని 2016 నవంబర్ 26న అప్పటి సీఈవో జుల్ఫీకరుల్లా తన బ్యాంక్ ఖాతాలోకి అక్రమంగా బదిలీ చేశాడు' అని సీఈవో అబ్బాస్ చెప్పారు. అయితే నిధుల్ని కాజేసిన ఇన్నేండ్ల తర్వాత 2024 జూన్ 12న వక్ఫ్ బోర్డ్ ఫిర్యాదు చేయటం సంచలనంగా మారింది. వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో జరిగినట్టుగానే వక్ఫ్ బోర్డ్‌లో నిధులు దారిమళ్లటం రాష్ట్రంలో సంచలనం రేపింది. వాల్మీకి స్కామ్‌లో ఏకంగా రాష్ట్ర మంత్రి బీ నాగేంద్ర సహా 11 మంది అరెస్టు అయ్యారు.

ఎక్స్‌లో 10 కోట్లకు చేరిన మోదీ ఫాలోయర్లు

న్యూఢిల్లీ: ఎక్స్ సామాజిక మాధ్యమంలో ప్రధాని మోదీ రికార్డు సృష్టించారు. ఆయ నను ఫాలో అవుతున్నవారి సంఖ్య ఆది వారం 10 కోట్లను దాటింది. గడచిన మూడే ళ్లలో దాదాపు 3 కోట్ల మంది ఫాలోయర్స్ పెరగడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో ఎక్స్ వేదికపై ఎక్కువ మంది ఫాలో అయ్యే ప్రభుత్వాధినేత మోదీనే. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు 2.75 కోట్ల మంది, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి 2.64 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు 3.81 కోట్ల మంది, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు 2.15 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు.

అందరికీ ఇన్సూరెన్స్!

- బీమా చట్టానికి సవరణలు
- బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం బిల్లు

న్యూఢిల్లీ: బీమా చట్టం, 1938ని సవరిం చడం కోసం ఓ బిల్లును రానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే అవకాశం కనిపిస్తున్నది. 2047నాటికి అందరికీ బీమా కల్పించాలనే లక్ష్యంతో ఈ చట్టాన్ని సవరించబోతున్నట్లు తెలుస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పాలసీదారుల ప్రయోజనాలతోపాటు సులు వుగా వ్యాపారం చేయడాన్ని ప్రోత్సహించే విధంగా ఈ సవరణ ఉండబోతున్నట్లు సమా చారం. కాంపోజిట్ లైసెన్స్, సాల్వెన్సీ నిబం ధనల తగ్గింపు, క్యాప్టివ్ లైసెన్స్ జారీ, ఇంట ర్మీడియరీలకు వన్ టైమ్ రిజిస్ట్రేషన్, ఇతర ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్ పంపిణీకి ఇన్సూరర్లకు అనుమతి ఇవ్వడం వంటి నిబంధనలు ఈ బిల్లులో ఉంటాయి. దీనివల్ల బ్యాంకింగ్ రంగంలో మాదిరిగానే బీమా రంగంలోకి కూడా ప్రత్యేకత గల బీమా కంపెనీలు వచ్చే అవకాశం ఉంటుంది. బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుత వర్గీకరణ ప్రకారం, యూనివర్సల్ బ్యాంక్, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, పేమెంట్స్ బ్యాంక్ ఉన్న సంగతి తెలిసిందే. కాంపోజిట్ లైసెన్స్ ఇవ్వడం వల్ల లైఫ్ ఇన్సూరర్లు జీవిత బీమా లేదా సాధారణ బీమా పాలసీలను మూల్యాంకనం చేసి, ప్రీమియం రేట్లను నిర్ణయించడానికి వీలవుతుంది. 1938నాటి చట్టం ప్రకారం లైఫ్ ఇన్సూరర్లు కేవలం జీవిత బీమాను, జనరల్ ఇన్సూరర్లు కేవలం ఆరోగ్య, మోటార్, అగ్ని ప్రమాద, మెరైన్ వంటి నాన్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్‌లను మాత్రమే ఇవ్వడానికి వీలవుతున్నది. అంటే ఓ ఇన్సూరెన్స్ కంపెనీ జీవిత బీమా ప్రొడక్ట్ లను, నాన్ లైఫ్ బీమా ప్రొడక్ట్‌లను ఏక మొత్తంగా ఇవ్వడానికి వీలుకాదు. ఈ పరిస్థితిని నివారించి, అందరికీ బీమాను అందజేయాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ బిల్లు తుది ముసాయిదా సిద్ధమైనట్లు తెలుస్తున్నది. దీనిని కేంద్ర క్యాబినెట్ ఆమోదం కోసం పంపిస్తారు.

ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ము కశ్మీరులోని కేరన్ సెక్టర్‌లో ఆదివారం ముగ్గురు ఉగ్రవా దులను భారత సైన్యం మట్టుబెట్టింది. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి భారత్‌లోకి చొరబడేందుకు వీరు చేసిన ప్రయత్నాలను విఫలం చేసింది. వీరి వద్ద నుంచి ఆయుధాలను, యుద్ధ సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. ఉగ్రవాదుల చొర బాట్ల నిరోధక కార్యకలాపాలను కొన సాగిస్తున్నట్లు వివరించింది.

మణిపూర్‌లో మిలిటెంట్ల దాడి

సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో భద్రతా బలగాలపై మిలిటెంట్లు జరి పిన దాడిలో ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్ ప్రాణాలు కోల్పోయాడు. జిరిబామ్ జిల్లా మాంగ్‌బంగ్ గ్రామంలో ఆది వారం ఉదయం సీఆర్‌పీఎఫ్, పోలీ సులు కలిసి గాలింపు చేపడుతుండగా, సాయుధులైన కొందరు దుండగులు దాడి చేశారు. కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన అజయ్ కుమార్ ఝా (43) మృతి చెందగా, ఒక పోలీస్ గాయప డ్డాడు. అతడిని వెంటనే దవాఖానకు తరలించగా, ప్రాణాపాయం తప్పింది. ఈ కాల్పుల్లో భద్రతా దళాలకు చెం దిన ఒక వాహనం కూడా ధ్వంసమై ంది. కుకీ జాతికి చెందిన మిలిటెంట్లు ఈ దారుణానికి పాల్పడి ఉం టారని పోలీసులు అనుమానిస్తున్నారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో 20 లక్షల టోకరా

హైదరాబాద్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ అరెస్టు

న్యూఢిల్లీ, జూలై 14: క్రిప్టోకరెన్సీ పేరుతో ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు కాజేసిన హైదరాబా ద్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ అఖిలే శ్వర్ రెడ్డిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. మరొక నిందితుడి కోసం గాలి స్తున్నట్టు ద్వారకా డీసీపీ అకింత్ సింగ్ చెప్పారు. క్రిప్టోకరెన్సీ కొనుగోలు, అమ్మకం ద్వారా భారీ మొత్తంలో ఆదాయముంటుందని, తన నుంచి రూ.20.16 లక్షలు పెట్టుబడిగా తీసు కుని మోసం చేశారని ఢిల్లీలోని ద్వార కకు చెందిన అక్షయ్‌కుమార్ సింగ్ నేషనల్ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన ఢిల్లీ పోలీ సులు.. నిందితులు హైదరాబాద్‌కు చెందిన వారని గుర్తించారు.